

తాప్సీ, షారుఖ్‌ఖాన్

## నలుగురు స్నేహితుల కథ

'పఠాన్' 'జవాన్' చిత్రాలతో ఈ ఏడాది భారీ విజయాలను తన ఖాతాలో వేసుకున్నారు అగ్ర హీరో షారుఖ్‌ఖాన్. ఆయన రాజ్‌కుమార్ హిరాణీ దర్శకత్వంలో నటిస్తున్న తాజా చిత్రం 'డంకీ' క్రిస్మస్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకురానుంది. గురువారం షారుఖ్‌ఖాన్ జన్మదినం సందర్భంగా టీజర్‌ను విడుదల చేశారు. విదేశాలకు వెళ్లాలనుకునే నలుగురు స్నేహితుల చుట్టూ అల్లుకున్న కథ ఇది. ఈ క్రమంలో వారికి ఎదురైన సవాళ్లను హాస్య ప్రధానంగా చూపించారు. యధార్థ సంఘటనల ఆధారంగా రాసుకున్న ఈ కథలో ప్రేమ, స్నేహం గొప్పదనాన్ని ఆవిష్కరిస్తూ తనదైన శైలి ఎమోషన్స్‌తో తెరకెక్కించారు దర్శకుడు రాజ్‌కుమార్ హీరాణీ. వినోదం, సందేశం ప్రధానంగా ఈ చిత్రం అన్ని వర్గాలను ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. జియో స్టూడియోస్, రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.


## యువతకు కనెక్ట్ అవుతుంది

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకుడు. లక్కీ మీడియా పతాకంపై బెక్కెం వేణుగోపాల్ నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ చిత్ర టైటిల్ లోగోను అగ్ర నిర్మాత దిల్‌రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ టైటిల్‌తో నేనొక రొమాంటిక్ ఎంటర్‌టైనర్ తీద్దామనుకున్నా. అయితే తమ సినిమా కథకు బాగా సరిపోదుతుందని చెప్పడంతో టైటిల్ ఇచ్చేశాను. కొత్త కంటెంట్‌తో వస్తున్న ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది' అన్నారు. యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇదని, నేటి యువతకు బాగా కనెక్ట్ అవుతుందని నిర్మాత బెక్కెం వేణుగోపాల్ తెలిపారు. నువ్వేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సంతోష్ రెడ్డి, హర్షవర్ధన్ రామేశ్వర్, ఆర్.ఆర్.ధృవన్, వసంత్ జి, నిర్మాతలు: బెక్కెం వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: విక్రమ్‌రెడ్డి.




## అతనే నా సూపర్‌హీరో!

'కెప్టెన్ మార్వెల్ నాకు అత్యంత ఇష్టమైన సూపర్‌హీరో. ఈసారి ముగ్గురు శక్తివంతమైన సూపర్‌హీరోలు చెడుపై మంచి సాగించే అంతిమ యుద్ధంలో పాల్గొంటున్నారు' అని చెప్పింది అగ్ర కథానాయిక సమంత. మార్వెల్ స్టూడియోస్ నిర్మించిన 'ది మార్వెల్స్' చిత్రం ఈ నెల 10న ఇంగ్లీష్, తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ఈ చిత్రానికి సంబంధించిన ఓ ప్రత్యేక వీడియోను హైదరాబాద్‌లో ఆవిష్కరించింది సమంత. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ 'మార్వెల్ ఇండియాతో కలిసి ప్రయాణం చేయడం థ్రిల్లింగ్‌గా ఉంది. యాక్షన్ ప్యాక్డ్ ఎంటర్‌టైనర్‌గా 'ది మార్వెల్స్' ప్రేక్షకులకు థ్రిల్‌ని పంచుతుంది. ఈ దీపావళికి పెద్ద స్క్రీన్‌పై ఈ సినిమా చూడాలని ఉత్సాహంగా ఉంది' అని పేర్కొంది. 'ఖుషీ' తర్వాత తెలుగులో మరే చిత్రాన్ని అంగీకరించలేదు సమంత. హిందీలో మాత్రం వెబ్‌సిరీస్‌లో నటిస్తున్నది.



## నమస్తే ఇండియా



'**ఏ తప్పు జరిగినా** నేను తప్పకుండా వస్తాను.. భారతీయుడుకి చావేలేదు.. '.. సేనాపతి పాత్రలో ఉన్న కమల్‌హాసన్ ఈ డైలాగ్ చెప్పడంతో 'భారతీయుడు' సినిమా ముగుస్తుంది. సీక్వెల్ రావొచ్చు అన్న బీజాన్ని ప్రేక్షకుల మనసుల్లో ఆనాడే నాటేశాడు దర్శకుడు శంకర్. అనుకున్నట్టే 'భారతీయుడు 2' మొదలైంది. నిర్మాణం తుదిదశకు చేరుకుంది. వచ్చే ఏడాది విడుదలకు రెడీ అవుతున్నది. శుక్రవారం 'భారతీయుడు 2'లోని సేనాపతి పాత్రను ఓ వీడియో ద్వారా పరిచయం చేశారు మేకర్స్. ఈ వీడియోలో పెట్రేగిపోతున్న లంచగొండితనాన్ని, ప్రబలమవుతున్న పేదరికాన్ని, అంతకంతకూ ఎదిగిపోతున్న ధనికవర్గాలను కళ్లకు కట్టాడు దర్శకుడు శంకర్. 1996 నుంచి 2023వరకూ టెక్నాలజీతోపాటు పెరుగుతున్న అవినీతిని చూపించాడు. 27ఏళ్ల క్రితం దేశం వదిలి వెళ్లిపోయిన సేనాపతి మళ్లీ రావాలని కోరుకుంటూ.. 'కంబ్యాక్ ఇండియన్' అంటూ దేశం మొత్తం ముక్తకంఠంతో సేనాపతిని పిలుస్తున్నట్టు వీడియోలో చూపించాడు. సేనాపతి రావాలని కాశీలో జనం పూజలు చేస్తున్నారు. ఎట్టకేలకు జనం కోరిక ఫలించింది. సేనాపతి వచ్చాడు. 'నమస్తే ఇండియా.. భారతీయుడు ఈజ్ బ్యాక్..' అనడంతో వీడియో ముగిసింది. మొత్తానికి వీడియోని బట్టి చూస్తే, అవినీతి, లంచగొండి తనంపైనే ఈ సీక్వెల్ సాగినట్టు అర్థమవుతున్నది. మరి 'భారతీయుడు'లోని ఎమోషన్స్, దేశభక్తి, అత్యద్భుతమైన సంగీతం ఇందులో ఉన్నాయా? అనేది తెలియాల్సివుంది. 'భారతీయుడు'లో కీలక పాత్ర పోషించిన స్వర్గీయ నడిముడి వేణు ఇందులోనూ కీలకపాత్ర పోషించారు. హీరో సిద్దార్థ్ కథలో కీ రోల్ చేసినట్టు, కథానాయికలు రకుల్‌ప్రీత్‌సింగ్, ప్రియ భవానీ శంకర్ ఎమోషనల్ పాత్రలు పోషించినట్టు వీడియో ద్వారా తెలుస్తున్నది. ఇంకా బ్రహ్మానందం, ఎస్.జె.సూర్య, సముద్రఖని, బాబీ సింహా తదితరులు వీడియోలో తళుక్కున మెరిశారు. అనిరుథ్ సంగీతం ఈ వీడియోకు ప్రత్యేక ఆకర్షణ. సుభాస్కరన్ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.

## అప్పడప్పడు తాండ్ర.. ఆవకాయ తాండ్ర

పాయల్‌రాజ్‌పుత్, అజ్మల్ అమీర్ జంటగా నటిస్తున్న చిత్రం 'మంగళవారం'. అజయ్ భూపతి దర్శకుడు. డార్క్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కిస్తున్నారు. ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో యువ దర్శకుడు, నటుడు తరుణ్‌భాస్కర్ 'అప్పడప్పడు తాండ్ర ఆవకాయ తాండ్ర' అనే ప్రత్యేక గీతాన్ని చేశారు. గణేష్.ఏ రాసిన ఈ గీతాన్ని రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. శుక్రవారం లిరికల్ వీడియోను విడుదల చేశారు. ఇందులో మాస్ గెటప్‌లో ఆకట్టుకుంటున్నారు తరుణ్‌భాస్కర్. దర్శకుడు అజయ్‌భూపతి మాట్లాడుతూ 'గోదావరి జిల్లాలోని పల్లెటూర్లలో ఆటపాటల సందర్భంగా పిల్లలు పాడుకునే పాట ఇది. పల్లె జనం సంభాషణలు, ఊరిలోని పరిస్థితులను తెరపై ఆవిష్కరిస్తూ పాట సాగుతుంది. ఇప్పటివరకు భారతీయ తెరపై రానటువంటి యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: దాశరథి శివేంద్ర, సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్, మాటలు: తాజుద్దీన్ సయ్యద్, రాఘవ్, నిర్మాతలు: స్వాతిరెడ్డి గునుపాటి, సురేష్ వర్మ.ఎం, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: అజయ్‌భూపతి.



తరుణ్‌భాస్కర్



## ఈశ్వరరావు ఇకలేరు

సీనియర్ నటుడు ఈశ్వరరావు కన్నుమూశారు. అమెరికాలోని మిచిగన్‌లో తన కుమార్తె ఇంటికి వెళ్లిన ఆయన అక్కడే తుదిశ్వాస విడిచాడు. అక్టోబర్ 31నే ఆయన కన్నుమూయగా ఆలస్యంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈశ్వరరావు తెలుగులో దాదాపు 200 పై చిలుకు చిత్రాల్లో విభిన్నమైన పాత్రలు పోషించారు. దాసరి నారాయణరావు తెరకెక్కించిన 'స్వర్గం-నగరం' ఈశ్వరరావు తొలి చిత్రం. తొలిసినిమాతోనే నంది అవార్డును సొంతం చేసుకున్నారు ఈశ్వరరావు. ఆ సినిమా తర్వాత ఈశ్వరరావుకి అవకాశాలు ఊపందుకున్నాయి. దేవతలారా దీవించండి, యుగపురుషుడు, ప్రేమాభిషేకం, జయంమనదే, ప్రెసిడెంట్‌గారి అబ్బాయి, దయామయుడు, శభాష్ గోపీ, ఘరనామొగుడు తదితర చిత్రాల్లో మంచి పాత్రలు పోషించారు ఈశ్వరరావు. చిరంజీవి 'ఘరానామొగుడు' ఈశ్వరరావు చివరి సినిమా. ఆ సినిమా తర్వాత ఆయన పలు ధారావాహికల్లో కూడా నటించారు. పరిశ్రమలో సౌమ్యుడు, మంచి నటుడిగా పేరుగాంచిన ఈశ్వరరావు మరణం పట్ల తెలుగు చిత్ర పరిశ్రమ తీవ్ర విచారం వ్యక్తం చేసింది.



## అలాంటి అనుభూతి కలిగింది

2002లో 'మౌనం పేసియాదే' అనే తమిళ సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైంది త్రిష. అంటే కథానాయికగా తన ప్రయాణానికి 21ఏండ్లు. హీరోయిన్‌గా రెండు దశాబ్దాల పైన కెరీర్ అంటే చిన్నవిషయం కాదు. ఈ క్రెడిట్ చాలా తక్కువ మంది కథానాయికలకు మాత్రమే ఉంది. పైగా నేటికీ త్రిష స్టార్ హీరోయినే. ఇప్పటికీ విజయాలను అందుకుంటూనే వుండటం విశేషం. మొన్న 'పొన్నియన్ సెల్వం' సిరీస్‌తో వరుసగా రెండు విజయాలు అందుకోగా, ఇప్పుడు 'లియో'తో మూడో హిట్ కొట్టి, ఈ లేట్ వయసులో కూడా హ్యాట్రిక్ సొంతం చేసుకుంది త్రిష. ఇదిలావుంటే.. తన రీసెంట్ హిట్ 'లియో' విజయోత్సవంలో భాగంగా హాజరైన త్రిష వేదికపై ఆసక్తికరంగా మాట్లాడింది. ' కొన్నేళ్ల విరామం తర్వాత స్కూల్ ఫ్రెండ్స్ కలిస్తే ఎలాంటి అనుభూతి కలుగుతుందో విజయ్‌తో సినిమా చేస్తుంటే నాకు అలాంటి అనుభూతి కలిగింది. నా కెరీర్‌లో ఎక్కువ సినిమాలు తనతోనే చేశాను. విజయ్ సింప్లిసిటీ, పనిపై తనుపెట్టే ఎఫెర్ట్ వేరెవరిదగ్గరా చూడలేం. నా చిరకాల మిత్రుడితో మళ్లీ ఓ సినిమా చేయాలనుంది. ఆ కోరిక ఎప్పుడు తీరుతుందో' అంటూ ఉద్వేగంగా మాట్లాడింది త్రిష. ఆమె మాటలు తమిళ మీడియాలో ప్రస్తుతం చర్చనీయాంశమయ్యాయి.

## హబీబీ జిలేబీ..



రోషన్ కనకాల హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'బబుల్‌గమ్'. మానస చౌదరి కథానాయిక. రవికాంత్ పేరేవు దర్శకుడు. పీపుల్ మీడియాతో కలిసి మహేశ్వరి మూవీస్ నిర్మిస్తున్న ఈచిత్రం డిసెంబర్ 29న విడుదల కానుంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్‌ను మేకర్స్ మొదలుపెట్టారు. ఈ సందర్భంగా శ్రీచరణ్ పాకాల స్వరాలందించిన ఈ చిత్రంలోని పాటల్లో 'హబీబీ జిలేజీ' అని సాగే తొలి పాటను విక్టరీ వెంకటేశ్ విడుదల చేశారు. రాహుల్ సిప్లిగంజ్ పాడిన ఈ పాటను కాసర్ల శ్యామ్ రాశారు. శ్రోతలను ఆకట్టుకునేలా పాట సాగిందని, శ్రీచరణ్ పాకాల మాస్ మెచ్చే విధంగా మ్యూజిక్ అందించారని, మనసుల్ని హత్తుకునే ప్రేమకథగా 'బబుల్‌గమ్' రూపొందుతోందని మేకర్స్ తెలిపారు. ఈ చితానికి కథ: రవికాంత్ పేరెవు, విష్ణు కొండూరు, సెరి గన్ని, కెమెరా: సురేశ్ రగుతు.

## కథకు ఎమోషన్సే బలం



వెంకట్

'సినిమా ఎంత గ్రాండియర్‌గా ఉంది అనేది ముఖ్యం కాదు, సినిమాలో ఎమోషన్స్ ఏస్థాయిలో ఉన్నాయి అనేదే ముఖ్యం. సినిమాను ప్రేక్షకుడికి దగ్గర చేసేది ఎమోషన్స్ మాత్రమే' అంటున్నారు దర్శకుడు ఆర్.ఎ.వెంకట్. ఆయన దర్శకత్వంలో స్రవంతి రవికిశోర్ నిర్మించిన తమిళ చిత్రం 'కిడ'. ఈ చిత్రాన్ని 'దీపావళి' పేరుతో తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు ఆర్.ఎ.వెంకట్ విలేకరులతో మాట్లాడారు. 'ఓ సారి స్నేహితులతో కలిసి ఓ సినిమా చూస్తున్నాను. ఆ సమయంలో నా మనసులో మెదిలిన ఆలోచనే ఈ సినిమా. పల్లెటూరు, మేకలు పెంచుకునే ఓ ముసలాయన, ఆయనకు ఓ మనవడు, వారు ప్రేమగా పెంచుకునే ఓ మేకపిల్ల.. ఈ అంశాలే ఈ కథకు ఆయుధాలు. అదే నా 'కిడ' సినిమా' అన్నారు వెంకట్. తెలుగులో ఎన్నో అగ్ర చిత్రాలను నిర్మించిన రవికిశోర్‌గారు నా సినిమాను నిర్మిస్తారని కలలోకూడా అనుకోలేదని, ఆయన సహకారం వల్లే ఈ సినిమాను ఇంతబాగా తీయగలిగానని వెంకట్ చెప్పారు. .గోవా చలనచిత్రోత్సవాల్లో, చెన్నయ్ చలనచిత్రోత్సవాల్లో, మెల్‌బోర్న్ చలనచిత్రోత్సవాల్లో ఈ సినిమాను ప్రదర్శించి ప్రశంసించాని వెంకట్ తెలిపారు. త్వరలో స్రవంతి సంస్థలోనే మరో సినిమా చేయబోతున్నానని వెంకట్ చెప్పారు.

## నవతరం ప్రేమకథ



నవీన్‌రాజ్, పూజా సుహాసిని, శ్రీలు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'తెరచాప'. జోయల్ జార్జ్ దర్శకత్వం వహించారు. అనన్యా క్రియేషన్స్, హరితవనం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై కైలాష్ దుర్గం నిర్మించారు. ఈ చిత్ర టైటిల్‌ను విశ్వక్‌సేన్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'ఈ సినిమా కథతో పాటు నిర్మాణ విలువలు బాగున్నాయి. సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా' అన్నారు. నవతరం ప్రేమకథా చిత్రమిదని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: అజీమ్-వెంకట్, సంగీతం: ప్రజ్వల్ క్రిష్, దర్శకత్వం: జోయల్ జార్జ్.